# శీల

దండమూడి మహీధర్ కుమార్

★

నాకు తెలీదు. ఎక్కడా చూచిన గుర్తూలేదు. నన్నెలా ఎరుగో మరి? కాలేజీకి శలవలిచ్చారు. హాస్టల్‌లో ఎవరూ లేరు. నాకు ఏకాంతం ఎంతో ఇష్టం! అందుకే శలవల్లోకూడా ఇక్కడే వుండి పోయాను.

మధ్యాహ్నం — ఇంకా మూడు గంటలన్నా కాలేదు. నేను నిద్రలోవుండగా తలుపుతట్టిన చప్పుడయింది. పరిచయమైన వ్యక్తిగా భావించి తలుపు తెరచాను. కాని చూచేప్పటికి, అతనెవరో నాకు తెలీలేదు. అతని ముఖంమాత్రం ఏదో బాధను సూచిస్తోంది!

నన్ను చూడ్డంతోనే 'హిమకర్ మీరేనా?' అని ప్రశ్నించాడు. 'అవున'ని లోనికి ఆహ్వానించాను. ఆయన కుర్చీలో — నేను నా బెడ్‌మీద కూర్చున్నాం. ఆయన రూం నలువేపులా పరికిస్తున్నాడు. కాని అతని హృదయం తెలీని బాధను అనుభవిస్తున్నట్లు వూహించగలిగాను. ఇక వుండలేకపోయా — 'క్షమించండి! మీరెవరో నాకు తెలీద'న్నా — అతికష్టంతో. బలవంతంగా నవ్వు తెచ్చుకోవాలని యత్నిస్తూన్న ఆయన ముఖాన్ని నేను కనిపెట్టాను. 'నా పేరు గిరి! శీల భర్తను' — అని విప్పారిన ముఖంతో అనేశాడు. వెన్వెంటనే ముడుచుకపోయిన ఆయన ముఖపద్మాన్ని పరికించి నేను విస్తుపోయాను.

ఇతను శీల భర్తా? శీల!! ఈ పేరు వినేప్పటికి నాలో భావాలు యుద్ధవిమానాలల్లే లేచి మంట బాంబులు వదిలాయి. వెనుకటి రోజులు స్మరణకు వచ్చాయి.

శీలా నేనూ కలిసి చదువుకున్నాం చిన్నప్పటినుంచీ. ప్రక్క-ప్రక్క గృహాలు కావడంవల్ల వయసు మళ్ళినా మా స్నేహంలో అవాంతరం కలుగలేదు. ఆమె నన్ను 'అన్నాయ్!' అని పిలిచేది సోదరభావంతోనే. మా మైత్రి వల్లరి పెరిగి పెద్దదయింది.

నా కింకా బాగా గుర్తు! శీలకు జబ్బుచేసింది. నేను కాలేజీ మానుకొని శీలకు సేవచేయడంలో నిమగ్నమయ్యాను. నుదురుకదిపి, చెంపల్ని నిమిరి మందు త్రాగించేవాణ్ణి. చివరకు శీల జబ్బునుంచి కోలుకుంది. కాలేజీకి మాత్రం రాలేకపోయింది శీల. ఆరోగ్యం పొందడానికి కారణం నేనేనని శీల తలిదండ్రు లిద్దరూ ఎంతో ప్రశంసించారు.

శీలకు యౌవన వసంతాలు పూర్తయిన రోజులవి! నామటుకు నేను శీలను కలుసుకునేందుకు వెళ్ళడం భావ్యం కాదనుకున్నా. మంచిని మంచిగా తలంచేంతటి స్థాయికి సంఘం చేరుకోలేదింకా!

శీల ఆవిధంగా పరివర్తనం కాకుండా వుంటే ఎంతబాగుండేది! కాని ఆమె అలా వర్తించలేదు, అలా మారుతుందని నేను వూహించనైనాలేదు. ఆ ఘటన ఇంకా నాకళ్లయెదుట మెదుల్తూనే వుంది.

ఆరోజుకూడా ఎప్పటిలాగా ఆమెను కలుసుకునేందుకు వెళ్లాను. ఆమె నన్ను నిలేసి 'నిన్ను ప్రేమిస్తున్నా'నంది. 'సోదరుని గనుక ప్రేమిస్తున్నావు ఇందుకు అభివందన'లన్నా. కాని ఆమె హృదయంలోని భావం మరో నిమిషంలోనే తెలిసిపోయింది. 'పెండ్లిచేసుకుందామ'ని చెప్పేసింది - నవ్వుతూ. శీల ఎదుట వుండలేకపోయాను. హృదయం మెదడులోకి వెచ్చనిరక్తాన్ని చిమ్మింది. భావాలు స్తంభించిపోయాయి. ఇన్నినాళ్ళనుంచి శీల నన్ను అర్థం చేసుకోలేకపోయినందుకు ఎంతో వేదనపడ్డా. హృదయవేదనతో మారుమాటాడకుండా వెళ్ళిపోయాను.

చివరకు కొద్దిరోజులకే ఆచోటు వదిలి మద్రాసు వచ్చేశాను. ఎంతో యత్నంమీద శీలను మరచిపోగలిగాను. నేను బి. యే.లో వుండగా శీల వివాహం జరిగింది. ఆమె భర్త ఏమీ, అంత చదువుకోపోయినా మంచి ధనవంతుడని మాత్రం విన్నాను. మొదట్లో

కొంతకాలంవరకు శీలనుంచి లేఖలు వస్తూండేవి. ఎందుకో సమాధానం వ్రాయలేక పోయాను.

* * *

వెనుకటి విషయాలన్నీ ఒకదాని తరువాత ఒకటి పరవళ్లు త్రొక్కుతుంటూ వస్తున్నాయి. నా భావనల అల్లిక చిక్కుచిక్కుగానేవుంది. శీల భర్త అసిత్‌కుమార్‌హాల్దార్ గీచిన ఒక చిత్రాన్ని పరిశీలిస్తున్నాడు. శీల భర్త అంతరూపసి కాదు. కాని హృదయ సౌందర్యంగల మనిషిలాగా కన్పిస్తున్నాడు. నా ఆలోచనలు అలాగేసాగిపోతున్నాయి. శీలభర్త నా వద్దకు ఎందుకువచ్చిందీ యెంతయత్నించినా వూహించుకోలేక పోయాను.

నాహస్తాలు శరత్ 'శ్రీకాంత్' పుటల్ని తిరగేస్తున్నాయి. ఆయన నావేపే చూస్తున్నాడు. అతని చూపులు 'ఇంతవరకు సాగిస్తున్న పరిశీలన నన్ను గురించే' అన్నట్లున్నాయి.

'శీలకు జబ్బుచేసింది. జీవించే ఆశలేదు. మాటిమాటికి మిమ్మల్ని పిలుస్తోంది. ఒకసారి మీరు శీలను చూచేందుకు రావాలి' అని ఆయన దుఃఖభరితమైన కంఠం ఆహ్వానించింది. ఒక్కసారిగా నాహృదయంలోని భావాలు కరడుగట్టుకపోయాయి.

వెనుక పెండ్లికాకముందు శీలకు జబ్బు చేసిన సంగతి గుర్తుకొచ్చింది. నేను సోదరుణ్ణిగా చేసిన సేవ గుర్తొచ్చింది. ఆటు తరువాత తన్ను పెండ్లిచేసుకోమని బలవంతంచేసిన దృశ్యం కూడా నా కన్నుల ఎదుట మెదిలింది.

ఇప్పుడు శీలకు వివాహమయింది. మరల నన్ను పిలిపించుకోడంలో శీల వుద్దేశ్యం నాకు అవగతం కాలేదు. ఈనాడు ఆమె వివాహిత. స్త్రీహృదయం వివాహమయ్యాక పూర్తి పరివర్తనం చెందుతుంది. తన జీవిత గ్రంథంలో ప్రథమాధ్యాయాల్ని స్మరించుకుంటే ఆమె జీవించలేదు. ప్రతిస్త్రీ ఇంతే. గతాన్ని విస్మరించి భర్తను అనుగమించడంలోనే స్త్రీ సఫలమవుతుంది. శీల ఈ నిత్య సత్యాన్ని ఎందుకు త్యజించిందో నాకు తెలీలేదు.

బక్క చిక్కి శల్యమైపోయిన శీలను గుర్తుపట్టలేక పోయాను. శీల భర్తకూడా నాతోపాటు గదిలోకివచ్చి—కూర్చునేందుకు కుర్చీచూపించి ఏదో పనిమీద బయటికి వెళ్ళిపోయాడు. శీలవేపు చూచాను. ఆమె నన్నుచూచి నవ్వింది. ఆ నవ్వు చిగిర్చిన మోడును గుర్తుకు తెచ్చింది. గులాబీ పువ్వులాంటి శీల ముఖం ఎంతో బలహీనపడిపోయింది. చాలా విచారించాను. మానసిక వేదనతో మనిషి క్రుంగిపోగలడని— నేనా రోజే తెలుసుకున్నాను. నాకు నేను వుండలేక పోయాను. వెంటనే శీల ప్రక్కకు వెళ్ళి కూర్చొని—'ఎలావుంది శీలా?' అన్నా. శీల నా రెండు చేతుల్ని పుచ్చుకొని తన నుదురుమీద వుంచుకుంది. వెనుక ఆమెకు జబ్బు చేసినప్పుడు నేను ఆమె నుదురు కదిపి ముంగురులను సవరిస్తూ మందు త్రాగించాను. ఆనాడు ఆమె నన్ను సోదరభావంతో ప్రేమించింది. కాని తరువాత ఆమె హృదయం పరివర్తనం చెందింది. కాలగర్భంలో రోజులు, నెలలు నిహితమై పోయాయి. దీర్ఘకాలానంతరం ఇదే మొదటిసారి శీలను మరల చూడ్డం!

శీల నావేపు ఎంతో దీనంగా చూస్తోంది! ఆ చూపుల్లో పరివర్తనం గోచరించింది. సజలనయన దృక్కుల్లో ఆమె హృదయాన్ని చూడగలిగాను. వణుకుతూన్న శీల గొంతునుంచి శబ్దం వినిపించింది—'అన్నాయ్! నిన్ను అర్థంచేసుకోలేక పోయాను. నేను నీయెడల చూపిన అశ్లీల భావాలకు ఎంతో విచారించాను. నా తప్పిదాన్ని నీ ఎదుటవుంచి శాశ్వత నిద్రలో నిమగ్నంకావాలని నిన్ను పిలిపించుకున్నాను—' వణుకుతూన్నగొంతు అస్పష్టమైపోయింది. కొద్దినిమిషాల్లోనే ఆమె తన భౌతిక శరీరాన్ని వదిలింది. శాశ్వత నిద్రలో నిమగ్నమైపోయింది. డాక్టర్‌తోపాటు వచ్చిన శీల భర్తా, నేనూ అలాగే వుండిపోయాం శీల మృత శరీరాన్ని అవలోకిస్తూ.

నాకు ఎంతో సంతసం వేసింది. ఎంతో విచారం కలిగింది.

ఆమె అలాగే చూస్తోంది! చివరి క్షణాల్లో ఆమె నన్ను అన్నాయ్! అని పిలిచింది—అంతే! శీల సౌశీల్యవతి అని అప్పటికి తెలుసుకున్నా.